
సాక్షి
బాపట్ల
శనివారం : 24 : మే : 2025





## ముగిసిన సదరం క్యాంప్

తెనాలిఅర్బన్: వికలాంగుల ధృవపత్రాల పునఃపరిశీలనకు తెనాలిలోని జిల్లా వైద్యశాలలో ఏర్పాటైన ప్రత్యేక సదరం క్యాంప్ శుక్రవారంతో ముగిసింది.



## సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 512.50 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 5,598 క్యూసెక్కులు విడుదలవుతోంది.



## దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ

విజయవాడ: ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను శుక్రవారం భక్తులు భారీగా దర్శించుకున్నారు. లక్ష కుంకుమార్చనలో ఆలయ ఈఓ శీనా నాయక్ దంపతులు పాల్గొన్నారు.

## న్యూస్‌రీల్

### వైభవంగా ఆంజనేయుని రథోత్సవం

**వేమూరు:** మండలంలోని జంపని గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో వార్షిక హనుమజ్జయంతి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం సాయంత్రం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తుల హనుమ నామస్మరణ, మేళతాళాల మధ్య వేడుక సాగింది. కోలాటం, భజనల నడుమ రథోత్సవం జరిగింది. భక్తులు షేక్ అబ్దుల్ కలాం ఆజాద్ దంపతులు వార్షిక పూజాకర్తలుగా వ్యవహరించారు. పెరుమాళ్ల వెంకట సుబ్బయ్య, పెరుమాళ్ళ రామయ్య నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో గొంది శివరామ కృష్ణ ప్రసాద్, మన్నే శివ వెంకటేశ్వర రావులు ప్రసాద పంపిణీ చేశారు. ఆంజనేయ భక్త బృందం, సీతారామాంజనేయ భజన సమాజం, ఆంజనేయ యువజన భక్త సమాజం, వీరాంజనేయ కోలాట భజన సమాజం సభ్యులు పాల్గొన్నారు.

### నిత్యాన్నదానానికి విరాళం



**మోపిదేవి:** స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదానంకు బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం అద్దేపల్లి గ్రామ వాస్తవ్యుడు పానుగంటి జయ నటరాజ్‌కుమార్, లక్ష్మీదివ్య దంపతుల కుమారుడు షత్విక్ జయ దేవ్ పేరున రూ.1,00,001 విరాళంగా శుక్రవారం ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావుకు అందించారు. దాతలు తొలుత స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

### నేడు ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేక పీజీఆర్ఎస్

**నరసరావుపేట:** ప్రతి నెలా నాలుగో శనివారం ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేకంగా నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను శనివారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ఎస్సీలు, ఎస్టీలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

### ఆర్టీసీ స్థలాల అద్దె వ్యవహారంపై సమావేశం



**నరసరావుపేట:** సత్తెనపల్లి, నరసరావుపేట, పిడుగురాళ్లలో ఖాళీగా ఉన్న ఆర్టీసీ స్థలాలను 15 ఏళ్లపాటు చట్టపరమైన వ్యాపారం చేసుకునేందుకు అద్దె ప్రాతిపదికన ఇచ్చేందుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలతో శుక్రవారం ఆర్టీసీ డిపోలోని ప్రజా జిల్లా రవాణా అధికారి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. నెల్లూరు జోనల్ కార్యాలయం ద్వారా టెండర్లు పిలవనున్నారని పీటీడీ జిల్లా అధికారి ఎం.మధు పేర్కొన్నారు. ఇవ్వబోయే స్థలాలను గురించి పారిశ్రామిక వేత్తలతో చర్చించారు.

### నేడు సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సు

**పట్నంబజారు:** సరస్వతి పుష్కరాలు పురస్కరించుకుని ఏపీఎస్ ఆర్టీసీ గుంటూరు–2 డిపో నుంచి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు ఆర్ఎం ఎం.రవికాంత్ శనివారం తెలిపారు. 12 సంవత్సరాలకొకసారి వచ్చే పుష్కరాలకు సంబంధించి ఈనెల 24న గుంటూరు–2 డిపో నుంచి బస్సు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. యాత్ర మొత్తం మూడు రోజులు ఉంటుందని, 24వ తేదీ రాత్రి 10 గంటలకు బయల్దేరి, రెండో రోజు కాళేశ్వరం చేరుతుందన్నారు. అక్కడ పవిత్ర త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించిన తరువాత రామప్ప దేవాలయం, వరంగల్ భద్రకాళీ దేవాలయం, వెయ్యి స్థంభాల గుడి దర్శించడం జరుగుతోందన్నారు. మూడో రోజున కొండగట్టు శ్రీఆంజనేయ స్వామిని దర్శించి, అనంతరం వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరి స్వామివారిని దర్శించుకుని గుంటూరు తిరుగు ప్రయాణం అవుతుందన్నారు. ఈ సర్వీసుకు సంబంధించి ఆన్‌లైన్‌లో 96163 నంబరు ద్వారా రిజర్వేషన్ చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఒక్కొక్క ప్రయాణికుడికి రూ.2,420 టికెటు ధర నిర్ణయించినట్లు తెలిపారు. ఇతర వసతి, భోజన ఖర్చులు ఎవరివి వారే చూసుకోవాలని చెప్పారు. వివరాలకు 7382897459, 7382896403 సంప్రదించాలని కోరారు.

# శోకసంద్రంలో స్టూవర్టుపురం

- రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృత్యువాత
- లారీ కిందకు సగం దూసుకెళ్లిన కారు
- సీట్లలో ఇరుక్కుపోయిన మృతదేహాలు
- అరగంటపాటు శ్రమించి వెలికితీత
- డ్రైవర్ అతివేగమే దుర్ఘటనకు కారణం
- వైరల్ అవుతున్న సీసీ కెమెరా ఫుటేజ్
- మృతుల్లో ముగ్గురిది ఒకే కుటుంబం
- కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న బాధిత కుటుంబాల సభ్యులు
- స్టూవర్టుపురంలో విషాదఛాయలు



జేసీబీ సహాయంతో కారును వెనక్కు లాగిస్తున్న పోలీసులు



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు ముందు భాగం

**బాపట్ల టౌన్/కొమరోలు:** ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. అమరావతి – అనంతపురం జాతీయ రహదారిపై కొమరోలు మండలంలోని తాటిచెర్లమోటు సమీపంలో హెచ్‌పీ పెట్రోలు బంకు వద్ద శుక్రవారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. డ్రైవర్ కర్రెద్దుల దివాకర్ కారును అతివేగంగా నడపడంతో ఈ దుర్ఘటన జరిగింది. లారీని ఢీకొట్టిన తర్వాత కారు సగభాగం వరకు లారీ కిందకు దూసుకెళ్లింది. దీంతో కారు ముందు సీట్లలో కూర్చున్న డ్రైవర్ దివాకర్, పక్క సీటులో ఉన్న బొచ్చు సన్నీ మృతదేహాలు ఇరుక్కుపోయాయి. బయటకు తీసేందుకు జేసీబీ సహాయంతో అరగంటపాటు పోలీసులు శ్రమించాల్సి వచ్చింది. కారు వేగంగా వచ్చి లారీని ఢీకొట్టడంతో ఒక్కసారిగా పెద్ద శబ్దం వినిపించినట్లు పెట్రోలు బంకులో ఉన్న వ్యక్తులు తెలిపారు. పెట్రోలు బంకులోని సీసీ కెమెరాలో ఈ ప్రమాదం రికార్డయింది. ఆ ఫుటేజీ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కారులో ప్రయాణిస్తున్న బాపట్ల జిల్లా స్టూవర్టుపురం గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు, నలుగురు పురుషులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ ప్రమాదంలో స్టువర్టుపురం గ్రామం, న్యూ గ్యాంగ్‌కు చెందిన గజ్జల నరసింహ (23), గజ్జల అంకాలు (45), పెద్ద గ్యాంగ్‌కు చెందిన గజ్జల జోసఫ్ అలియాస్ బబ్బులు (25), కర్రెద్దుల దివాకర్(24), లారో గ్యాంగ్‌కు చెందిన బొచ్చు సన్నీ (27), 1వ గ్యాంగ్‌కు చెందిన మొగిలి చిన్న భవాని (23) మృతి చెందారు. భవాని కుమారుడు సిద్ధు, కుమార్తె సిరికి తీవ్రగాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. బాలుడు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం నంద్యాల తరలించారు. బాలిక ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

కుటుంబ కలహాలపై చర్చించేందుకు నంద్యాల జిల్లా డోన్‌లోని తమ బంధువుల ఇంటికి కారు ఆరుగురు వెళ్లారు. అక్కడ చర్చల అనంతరం మహానంది పుణ్యక్షేత్రాన్ని సందర్శించుకున్నారు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా ఈ ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.

**ఎటు చూసినా కన్నీరే**

**బాపట్ల టౌన్:** వ్యక్తిగత పనులపై డోన్‌కు వెళ్లి తిరుగు ప్రయాణంలో ఉండగా ఆరుగురు తిరిగిరాని లోకాలకు వెళ్లిన ఘటనతో స్టూవర్టుపురం శోకసంద్రంలో మునిగిపోయింది. ఒకే గ్రామానికి చెందిన ఆరుగురు ఒకేసారి మృత్యువు ఒడిలోకి జారుకోవడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామంలో ఏ ఒక్కరిని పలకరించిన కన్నీరే సమాధానమైంది. గురువారం మధ్యాహ్నం చీరాల మండలం, తోటవారిపాలెం గ్రామంలోని పోలేరమ్మ దేవాలయంలో గజ్జల నరసింహ కుమారుడికి అన్నప్రాసన కార్యక్రమం జరిగింది. నరసింహ భార్య జాబిల్లి కన్నీరుమున్నీరుగా విలపించడంతో స్థానికులు సైతం కంటతడి పెట్టుకున్నారు. ఈ దంపతులకు వివాహమై ఆరేళ్లయింది. కానీ ఎన్నో మొక్కుల తర్వాత ఆరు నెలల క్రితమే మగ బిడ్డకు జాబిల్లి జన్మనిచ్చింది. పోలేరమ్మ తల్లి గుడిలో అన్నప్రాసన చేశారు. ఇంతలోనే ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఆమె గుండెలు పగిలేలా విలపించడంతో ఓదార్చడం ఎవరితరం కావడం లేదు. ప్రమాదం విషయం తెలిసిన కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పెళ్లి కాని యువకులు కూడా మృత్యువాత పడటంతో ఆయా కుటుంబాల వారు విలపించిన తీరుతో స్థానికులు సైతం విషాదంలో మునిగిపోయారు.



మృతుడు కర్రెద్దుల దివాకర్



మృతుడు గజ్జల జోసఫ్ అలియాస్ బబ్బులు



మృతుడు బొచ్చు సన్నీ



మృతురాలు గజ్జల అంకాలు



మృతుడు గజ్జల నరసింహ

### కుటుంబంలో పెను విషాదం

గజ్జల అంకాలు, ఆమె కుమారుడు గజ్జల నరసింహ, కుమార్తె మొగిలి భవాని ఒకే సారి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు విలపిస్తున్న తీరు చూపరులను సైతం కంటతడి పెట్టించింది. అంకాలు భర్త జనార్దన్ ఎనిమిదేళ్ల క్రితం మృతి చెందారు. వీరికి ముగ్గురు సంతానం. ప్రస్తుతం అంకాలు సహా వారి కుమారుడు నరసింహ, కుమార్తె భవానీ కూడా మృతి చెందారు. కుటుంబంలో కేవలం అంకాలు పెద్ద కుమారుడు వాసు మాత్రమే మిగిలారు. కుటుంబం మొత్తాన్ని రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించిందంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.



విలపిస్తున్న నరసింహ భార్య జాబిల్లిని ఓదారుస్తున్న కుటుంబసభ్యులు

### మృత్యువులోనూ వీడని స్నేహబంధం

చిన్ననాటి నుంచి కలిసి తిరిగారు. ఎక్కడికైనా ఆ నలుగురు స్నేహితులు కలిసే వెళ్లారు. కుటుంబాలు వేరైనా ఓ తల్లి పిల్లల్లా కలిసి మెలసి తిరుగుతుంటారు. అలాంటి వీరి స్నేహాన్ని విధి వెక్కిరించింది. రోడ్డు ప్రమాదం రూపంలో వచ్చిన మృత్యువు వీరిని కబళించింది. ప్రాణ స్నేహితుల్ని విగత జీవులుగా మార్చింది. నాలుగు కుటుంబాలకు కడుపుకోత మిగిల్చింది. వీరిలో గజ్జల నరసింహకు మాత్రమే వివాహమైంది. గజ్జల జోసఫ్ అలియాస్ బబ్బులు ఆటోడ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. దేవర దివాకర్, బొచ్చు సన్నీలకు వివాహం కాలేదు. వీరి కుటుంబాలకు వీరే మగదిక్కు. దీంతో వారి కుటుంబ సభ్యులను ఓదార్చడం ఎవరితరం కావడం లేదు.

# ఎగసి పడుతున్న అలలు

- నిర్మానుష్యంగా మారిన సముద్ర తీరం
- వేట లేక అల్లాడుతున్న మత్స్యకారులు



నిర్మానుష్యంగా ఉన్న బాపట్ల బీచ్

**బాపట్ల:** వాతావరణంలో వచ్చిన మార్పు కారణంగా మూడు రోజులుగా సముద్రతీరం నిర్మానుష్యంగా మారింది. మరోపక్కన అలలు ఎగసి పడుతున్నాయి. ఆకాశం మేఘావృతం కావటంతోపాటు సాయంత్రానికి చిమ్మచీకట్లు కమ్ముకొంటున్నాయి. ఈదురుగాలులు ఎక్కువగా రావటంతో పాటు రాకాసి అలలు ఎగిసి పడుతుండటంతో తీరానికి వచ్చే పర్యాటకుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గిపోయింది. తీరం ఇంత నిర్మానుష్యంగా మారటం ఇటీవల కాలంలో ఎప్పుడు చూడలేదని స్థానికులు చెబుతున్నారు.

**కరువుభత్యం అంతంత మాత్రమే**

సముద్రం వేట నిషేధం సందర్భంగా 45 రోజులపాటు ప్రభుత్వం కరువుభత్యం ఇస్తోంది. బాపట్ల జిల్లాలో 5 వేల మందికిపైగానే మత్స్యకారులు ఉన్నప్పటికీ సగం మందికి కూడా అందలేదు. ఈ ఏడాది కూడా ఆకలికేకలు తప్పటం లేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**చిరువ్యాపారులలో అలజడి**

వాతావరణంలో వచ్చిన మార్పు కారణంగా సూర్యలంకకు పర్యాటకులు సంఖ్య తగ్గిపోవటంతో తీరంలోని చిరువ్యాపారులు కనీసం బోణీలు కూడా లేకపోవటంతో ఇబ్బంది పడుతున్నారు. కనీసం రోజుకు 50 మంది పర్యాటకులు కూడా రాకపోవటంతో ఆవేదన చెందుతున్నారు.

**నిలిచిన వేట**

గత నెల రోజులుగా వేట నిషేధం కావటంతో మరో వారంలో ఎత్తివేసేందుకు అవకాశం ఉండగా వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా ఇప్పటికీ అనుమతి రాలేదు. వేట మినహా మిగిలిన ఉపాధి అవకాశాలు కూడా లేకపోవటంతో సముద్రానికి దగ్గరగా ఉన్న రామ్‌నగర్ పెద్దకాలువలో మత్స్యకారులు చేపలు పడుతూ పొట్ట నింపుకొంటున్నారు.



తీరానికే పరిమితమైన పడవలు

## దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి

**జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి**



దివ్యాంగుల సమస్యలను ఆలకిస్తున్న జిల్లా కలెక్టర్

**బాపట్ల:** గిరిజన, దివ్యాంగుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లాలోని గిరిజన, దివ్యాంగుల కోసం ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన, దివ్యాంగుల సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. వేటపాలెంలో 60 మంది యానాది కులానికి చెందిన వారికి ఆలస్యంగా జనన ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారని, ఆధార్ కోసం పత్రాలు కోరుతూ వచ్చిన ఫిర్యాదునకు ఆయన స్పందించారు. వెంటనే పత్రాలు జారీ చేయాలని వేటపాలెం తహసీల్దార్‌ను ఆదేశించారు. అక్కయ్యపాలెం పంచాయతీలో 300 యానాదుల కుటుంబాలకు శ్మశానం కోసం స్థల సేకరణ చేసి నివేదిక అందించాలని కూడా ఆదేశాలిచ్చారు. జిల్లాలో దివ్యాంగుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం వారంలో సోమ, మంగళ, బుధవారాల్లో బాపట్ల జిల్లాలో విధులు నిర్వహించాలని సహాయ సంచాలకులు, వికలాంగుల సంక్షేమ శాఖ అధికారిని ఆయన ఆదేశించారు. వారి కోసం స్థానిక కలెక్టరేట్‌లో కార్యాలయం ఏర్పాటు చేశామన్నారు. మిగిలిన 3 రోజులు ప్రకాశం జిల్లాలో విధులు నిర్వహించాలని ఆయన దివ్యాంగుల శాఖ అధికారిని ఆదేశించారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో 5% కోటా అమలు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానంలో కూడా 5% ఉద్యోగ కల్పనకు చర్యలు తీసుకోవాలని ఆయన ఏడీని ఆదేశించారు. జిల్లాలో దివ్యాంగుల కొరకు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 5% షాపులు కేటాయింపునకు చర్యలు తీసుకోవాలని బాపట్ల మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. 16 మంది ట్రాన్స్ జెండర్‌లకు గుర్తింపు ధ్రువీకరణ పత్రాలను జిల్లా కలెక్టర్ అందజేశారు. యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో 42 వేల మంది ఉద్యోగులు ఉండగా, ఇప్పటి వరకు కేవలం 6 వేల మంది మాత్రమే రిజిస్ట్రేషన్ పూర్తి చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి గ్లోరియా, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ప్రకాష్ రావు, వికలాంగుల సంక్షేమ శాఖ అధికారి అర్చన తదితరులు పాల్గొన్నారు.

## మద్యం దుకాణాలు సమయపాలన పాటించాల్సిందే

- వైన్ షాపులు రాత్రి 10 గంటలకు మూసేలా ఎక్సైజ్ సిబ్బంది పర్యవేక్షణ
- అనధికార పర్మిట్ రూమ్‌లు నిర్వహించే వారిపై కఠిన చర్యలు
- విలేకరుల సమావేశంలో ఎక్సైజ్ శాఖ డెప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.శ్రీనివాస్



మాట్లాడుతున్న డాక్టర్ కె.శ్రీనివాస్

**నెహ్రూనగర్:** గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని బార్ అండ్ రెస్టారెంట్‌లు, వైన్ షాపులు తప్పనిసరిగా సమయపాలన పాటించాల్సిందేనని ఎక్సైజ్ శాఖ డెప్యూటీ కమిషనర్ డాక్టర్ కె. శ్రీనివాస్ స్పష్టం చేశారు. శుక్రవారం బ్రాడీపేటలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని మద్యం షాపులు రాత్రి 10 గంటలకు కచ్చితంగా మూసేయాల్సిందేనన్నారు. 10 గంటలకు వైన్ షాపులను మూసేలా ఎక్సైజ్ సిబ్బంది పర్యవేక్షిస్తారన్నారు. పర్మిట్ రూములు నిర్వహణకు అనుమతి లేదని, ఎవరైనా పర్మిట్ రూములల్లో మద్యం తాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బార్ అండ్ రెస్టారెంట్‌లు కూడా రాత్రి 11 గంటల వరకు లిక్కర్ సరఫరా, ఆ తరువాత గంట వరకు ఫుడ్ సరఫరాకు అనుమతి ఉందని చెప్పారు. అనంతరం తప్పనిసరిగా మూసివేయాల్సిందేనన్నారు. సమయ పాలనపై ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ ప్రత్యేక బృందాలు పర్యవేక్షణ చేస్తాయని తెలిపారు. వీరిపై ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌ల పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించే షాపుల లైసెన్స్ రద్దుకు చర్యలు తీసుకుంటామన్నారు. గత సంవత్సరం అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు మొత్తం 1,900 కేసులు నమోదు చేసి 1,201 మందిని అరెస్టు చేశామన్నారు. ఇందులో మద్యం 2,297 లీటర్లు, బీరు 119 లీటర్లు, నాటు సారా 444 లీటర్లు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. గంజాయి 2.89 గ్రాములు, కొకైన్ 8.5 గ్రాములు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారి నుంచి మొత్తం 21 వాహనాలను సీజ్ చేయడం జరిగిందన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్‌రెడ్డి, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఇ. మారయ్యబాబు పాల్గొన్నారు.

### పొగాకు మొత్తం

## ప్రభుత్వం కొనాల్సిందే

- కంపెనీల మెడలు వంచి బ్లాక్‌బర్లీ కొనిపించండి
- లేదంటే ప్రభుత్వమే పొగాకు బోర్డు లేదా మార్క్‌ఫెడ్‌ద్వారా కొనాలి
- రైతులను మభ్యపెట్టే చర్యలు ఆపాలి
- పొగాకు కొనుగోళ్లపై స్పష్టత ఇవ్వాలి
- వ్యవసాయశాఖ వద్ద అన్ని లెక్కలూ ఉన్నాయి
- పర్చూరు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త గాదె మధుసూదన్ రెడ్డి



గాదె మధుసూదన్‌రెడ్డి

**సాక్షి ప్రతినిధి, బాపట్ల:** ప్రభుత్వం డొంకతిరుగుడు ప్రకటనలతో రైతులను మభ్యపెట్టడం మాని వారి నుంచి బ్లాక్‌బర్లీ పొగాకును తక్షణం కొనుగోలు చేయాలని వైఎస్సార్‌సీపీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త గాదె మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... పొగాకు కంపెనీల మెడలు వంచి సరకు కొనిపించాలన్నారు. లేదంటే ప్రభుత్వమే టుబాకో బోర్డు లేదా మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. తద్వారా రైతులను ఆదుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం పాము చావక, కట్టె ఇరగక అనే చందంగా వ్యవహరిస్తోందన్నారు. రైతులను మభ్యపెట్టేలా ప్రకటనలతో సరిపెట్టకుండా వారిని చిత్తశుద్ధితో ఆదుకోవాలన్నారు. జిల్లాలో 99 శాతం బ్లాక్‌బర్లీని పర్చూరు నియోజకవర్గ రైతులు సాగుచేశారన్నారు. మొత్తం కొనుగోలు చేస్తామని ఆశపెట్టి తీరా పంట చేతికొచ్చాక కంపెనీలు మోసగించాయన్నారు. పొలాల్లో పొగాకు పెట్టుకొని వానకు తడుస్తుంటే అన్నదాతలు తీవ్ర ఆవేదన చెందుతున్నట్లు పేర్కొన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రైతుకంట కన్నీరు చూడలేదన్నారు. రైతులకు అన్నివిధాలా సహాయం అందించేందుకు రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు నెలకొల్పారన్నారు. వలంటీర్లు నిత్యం అందుబాటులో ఉండి ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా నిలిచారని తెలిపారు. ఇప్పుడు అన్ని వ్యవస్థలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసి ప్రజల ఉసురు పోసుకుంటోందని గాదె విమర్శించారు. ప్రభుత్వం కేవలం ప్రకటనలతో ప్రజలను వంచించకుండా తక్షణం పొగాకు కొని రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఏ ఒక్క రైతుకు అన్యాయం జరిగినా చూస్తూ ఊరుకునేది లేదన్నారు. రైతులతో కలిసి పోరాటానికి సిద్ధ పడతామన్నారు.

## క్లుప్తంగా

### కాలువలో పడి వృద్ధుడు మృతి

అల్లూరు (కర్లపాలెం): చేపల వేటకు వెళ్లి కాలువలో పడి ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన పిట్టలవానిపాలెం మండలం అల్లూరు గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శుక్రవారం చందోలు ఎస్‌ఐ ఎం.వెంకట శివకుమార్ యాదవ్ తెలిపిన వివరాల మేరకు.. అల్లూరు గ్రామానికి చెందిన కొమరగిరి సుబ్బారావు(75) నాలుగురోజుల క్రితం గ్రామంలోని సింక కాలువలో చేపలు పట్టడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారి నీట మునిగి మృతి చెందాడు. భార్య చనిపోవటంతో సుబ్బారావు ఒక్కడే ఉంటున్నాడు. శుక్రవారం కాలువలో మృతదేహం ఉందని స్థానికులు గుర్తించారు. పోలీసులు వెళ్లి మృతదేహాన్ని బయటకు తీయించారు. ఆయన కుమార్తె మచ్చా సూరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించేందుకు బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

### పేదరికం, అసమానతల మధ్య యువకుల జీవితాలు



మాట్లాడుతున్న సూర్యకుమారి

ఏఎన్‌యూ: పేదరికం, అసమానతల మధ్య యువకుల జీవితాలు కొనసాగుతున్నాయని సెస్ (సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్) సంస్థ నిర్వహించిన 'యంగ్ లైవ్స్ స్టడీ' అంశాలు బహిర్గతం చేశాయి. హైదరాబాద్ సెస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో యంగ్ లైవ్స్ స్టడీ అంశాలను విడుదల చేశారు. కార్యక్రమానికి ఏపీ మహిళ, శిశు సంక్షేమ, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల శాఖ కార్యదర్శి ఎ.సూర్యకుమారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'యంగ్ లైవ్స్ స్టడీ' ద్వారా 2001-02 నుంచి హైదరాబాద్ సెస్ దీర్ఘకాలిక అంతర్జాతీయ పరిశోధన అధ్యయనాన్ని నిర్వహించడం అభినందనీయమని సూర్యకుమారి పేర్కొన్నారు. సెస్ డైరెక్టర్ ఈ రేవతి మాట్లాడుతూ బాల, బాలికల జీవితాల్లో మార్పులను అధ్యయనం చేసేందుకు ఈ స్టడీ దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, సోషియాలజీ, సోషల్ వర్క్ విభాగాధిపతి ఆచార్య ఎం.త్రిమూర్తిరావు, యూజీసీ కోఆర్డినేటర్ ఆచార్య వై అశోక్ కుమార్, పలువురు అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# జాతీయ క్రీడకు గ్రహణం

ఒలింపిక్స్‌లో వరుసగా బంగారు పతకాలు సాధించిన క్రీడ. ప్రపంచం మెచ్చిన ధ్యాన్‌చంద్‌లాంటి అద్భుత క్రీడాకారులను అందించిన క్రీడ. ఘన చరిత్రను సొంతం చేసుకోవడంతోపాటు జాతీయ క్రీడ హోదాను దక్కించుకున్న హాకీకి జిల్లాలో చోటులేకుండా పోయింది.

- వేసవి శిక్షణలో కూడా లేని హాకీ
- కనీస మైదానం లేక అవస్థలు
- పట్టించుకోని నాయకులు, అధికారులు
- ఇతర ప్రాంతాలకు తరలిపోతున్న క్రీడాకారులు



గతంలో బీఆర్ స్టేడియంలో జరిగిన జాతీయ హాకీ పోటీల దృశ్యం (ఫైల్)



గతంలో వేసవి శిక్షణ శిబిరంలో సాధన చేస్తున్న చిన్నారులు (ఫైల్)

గుంటూరు వెస్ట్ (క్రీడలు): దశాబ్దకాలం నుంచి జిల్లాలో హాకీకి క్రీడా మైదానం లేదు. గుంటూరు నగరంలో సుమారు 18 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బీఆర్ స్టేడియంలో కూడా హాకీకి చోటుకల్పించకపోవడం దారుణమని సీనియర్ క్రీడాకారులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం వేసవి శిక్షణ శిబిరాలు జిల్లా వ్యాప్తంగా నడుస్తున్నాయి. దాదాపు 20 క్రీడల్లో చిన్నారులు ఉత్సాహంగా శిక్షణ తీసుకుంటున్నారు. అయితే ఇందులో హాకీ లేకపోవడం గమనార్హం. హాకీ సీనియర్ క్రీడాకారులు పలుమార్లు స్థానిక ప్రజాప్రతినిధులను, జిల్లా కలెక్టర్లను కలిసినా ఫలితం శూన్యం. ఓ ప్రైవేటు స్కూల్ యాజమాన్యం తమ పిల్లలకు సొంతంగా హాకీ టర్ఫ్‌ను ఏర్పాటు చేసుకుంది. జిల్లా క్రీడాభివృద్ధి శాఖాధికారులు కనీసం ఆ దిశగా చర్యలు కూడా తీసుకోకపోవడం ఏంటని కొందరు క్రీడా సంఘ ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిన క్రీడా పాలసీ ఏమయ్యిందో ఎవరికీ తెలీయదు.

**3 ఎకరాలు సరిపోతుంది**

హాకీ మైదానం కావాలంటే కనీసం మూడు ఎకరాలుంటే సరిపోయేది. పాలకులు మాత్రం కనీస చొరవ చూపడంలేదు. ప్రస్తుతం నగరంలో క్రీడాకారులు బాక్స్ క్రికెట్ గ్రౌండ్‌లో గంటకు రూ.1000 చెల్లించి సాధన చేస్తున్నారు. దీంతోపాటు కొన్ని కళాశాలల్లో ఖాళీ స్థలాలను తీసుకుని వారే బాగుచేసుకుని సాధన చేస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం 50 నుంచి 75 మంది వరకు రాష్ట్ర, జాతీయ స్థాయి హాకీ క్రీడాకారులున్నారు. ప్రస్తుతం కొందరు జాతీయ సీనియర్ నేషనల్స్ ఆడుతున్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఖేలో ఇండియా స్కీమ్‌ను ప్రవేశపెట్టింది. దీనిలో ఒక ఎంపీ, జిల్లా కలెక్టర్ కలిసి కొంచెం పనిచేస్తే హాకీ టర్ఫ్ వికెట్‌కు రూ.8 కోట్లు కేటాయిస్తుంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ అనంతపురంలో ప్రారంభమయ్యింది. కలెక్టర్ 3 నుంచి 5 ఎకరాల స్థలం కేటాయించి స్థానిక ఎంపీ సిఫార్సు ఉంటే ఈ నిధి విడుదల చేస్తున్నారు.

**చాలా ప్రయత్నాలు చేస్తున్నాం**



నేను భారత హాకీ జట్టు క్యాంపులో సాధన చేశాను. అంతర్జాతీయ రిఫరీగా పనిచేస్తున్నాను. జిల్లాలో హాకీకి గ్రహణం పట్టిందా అనిపిస్తుంది. ఎవర్ని అడిగినా చేద్దామంటారేగాని ముందుకు రారు. ప్రస్తుతం కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ క్రీడలపట్ల చొరవ చూపిస్తున్నారు. ఆయనను కలిసి వివరిస్తాను. జాతీయ క్రీడలకు కనీసం మైదానం లేకపోవడమంటే ఇది అవమానమే. గ్రౌండ్ ఇస్తే చాలు మా అసోసియేషన్ నుంచి క్రీడాకారులను, కిట్స్‌ను ఇతర అంశాలకు పూర్తి సహకారమందిస్తాం. మైదానం ఏర్పాటు చేసి, ఒక శాప్ హాకీ కోచ్‌ను ఇవ్వండి. కేవలం రెండు సంవత్సరాలు చూడండి ఎన్ని రిజల్ట్స్ గుంటూరు జిల్లాకు వస్తాయో. హాకీలో రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగాలు కూడా పొందే వీలుంటుంది.

– జి.హర్షవర్ధన్, హాకీ ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్.

**క్రీడాభివృద్ధి ఎలా ...**



కేవలం ప్రభుత్వ పాలసీలతో క్రీడాకారులు కాలేరు. క్షేత్ర స్థాయిలో మైదానం, శిక్షకులు ఉండాలి. మనకు రాజధాని అమరావతిని అభివృద్ధి చేస్తున్నారు. క్రీడా మైదానాలు కూడా అభివృద్ధి చెందుతాయని ఆశిస్తున్నాను. నేను సీనియర్ నేషనల్స్ ఆడుతున్నాను. ప్రతి రోజూ గుంటూరులో అటు ఇటు కలిపి 30 కి.మీ వెళ్ళి సాధన చేయాల్సి వస్తుంది. దయచేసి మైదానం ఏర్పాటు చేయండి.

– సయ్యద్ ఖాసిం అలీ, సీనియర్స్ హాకీ నేషనల్స్ క్రీడాకారుడు.

**ఈ క్రీడకు ఎవరు వస్తారు?**



మన జిల్లా నుంచి ఎందరో భారత హాకీ జట్టులో ఆడారు. దేశ వ్యాప్తంగా రాష్ట్ర హాకీ జట్టుకు మంచి పేరుంది. గుంటూరు జిల్లాలో మైదానాలు లేకపోవడం, ప్రభుత్వం నుంచి హాకీకి ఆదరణ లేకపోవడంతో క్రీడా సాధనకు చిన్నారులు రాకపోవడం తగ్గించారు. అసోసియేషన్ తరఫున ఎన్నో ప్రయత్నాలు చేశాం. ఫలితం లేకుండా పోయింది.

– ఎస్.క్రాంతి కుమార్, సీనియర్స్ హాకీ నేషనల్స్ క్రీడాకారుడు.

# క్షణికావేశంతో జీవితాలు నాశనం

**జిల్లా జడ్జి సయ్యద్ జియా ఉద్దీన్**

రేపల్లె: క్షణికావేశంలో చేసే తప్పులు జీవితానికి పెను ప్రమాదకరమని, తద్వారా జీవితాలు నాశనమయ్యే పరిస్థితులు నెలకొంటాయని గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి , జిల్లా సీనియర్ సివిల్ జడ్జి సయ్యద్ జియా ఉద్దీన్ అన్నారు. పట్టణంలోని సబ్ జైలును శుక్రవారం ఆయన సందర్శించి రిమాండ్ ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పించారు. సత్ప్రవర్తనతో కూడిన జీవితాన్ని అవలంబిస్తే వారితోపాటు కుటుంబం భవిష్యత్ కూడా బాగుంటుందని చెప్పారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విరామ సమయంలో పుస్తక పఠనం అలవరుచుకోవాలన్నారు. రిమాండ్‌లో ఉన్న ఖైదీలకు ప్రభుత్వపరంగా న్యాయ సేవలు పొందేందుకు అవకాశం ఉందన్నారు. ప్రైవేటు న్యాయవాదిని ఏర్పాటు చేసుకోలేని వారు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ద్వారా ఉచితంగా న్యాయ సేవలు పొందవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా పలు న్యాయ సేవా చట్టాలపై అవగాహన కల్పించారు. సబ్‌జైలులో ఖైదీలకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సబ్‌జైల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, న్యాయవాదులు కుమార్ బాబు, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి



వెంకటరాజు (ఫైల్)



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఐజీ రామకృష్ణ

చీరాల: రోడ్డు ప్రమాదంలో చీరాలకు చెందిన కానిస్టేబుల్ మృతి చెందారు. ఈ సంఘటన గుంటూరు జిల్లా పెదనందిపాడు సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. పట్టణంలోని పేరాల గొల్లపాలెంలో నివాసముంటున్న కీర్తి వెంకటరాజు (45) బాపట్ల జిల్లా కేంద్రంలో ఇంటిలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్నారు. గురువారం ఆయన తన స్నేహితుడు డీవీఎస్ గుప్తాతో కలిసి గుంటూరు నుంచి చీరాలకు కారులో వస్తుండగా పెదనందిపాడు సమీపంలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. గుప్తాకు తీవ్ర గాయాలు కావడంతో గుంటూరు తరలించారు. వెంకటరాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. చీరాల సబ్ డివిజన్‌లో పలు పోలీసుస్టేషన్లలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించి ప్రస్తుతం జిల్లా స్పెషల్ బ్రాంచిలో ఆయన పనిచేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. వెంకటరాజుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కానిస్టేబుల్ మరణవార్త తెలుసుకున్న పోలీస్ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటెలిజెన్స్ ఐజీ రామకృష్ణ నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యుల రోదనలు అందర్నీ కలచివేశాయి. అనంతరం పోలీసు లాంఛనాలతో వెంకటరాజు అంత్యక్రియలు నిర్వహించారు.

# పేదల అభివృద్ధే సహకార బ్యాంక్ లక్ష్యం



మాట్లాడుతున్న జేవీ సత్యనారాయణమూర్తి

బాపట్ల: పేద ప్రజల అభివృద్ధే లక్ష్యంగా విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ తన సేవలను కొనసాగిస్తూ ఖాతాదారుల మన్ననలు పొందుతోందని బ్యాంక్ డైరెక్టర్ జేవీ సత్యనారాయణమూర్తి అన్నారు. బాపట్ల బ్రాంచ్ సభ్యుల మహాసభ శుక్రవారం బ్రాంచి ఆవరణలో జరిగింది. బ్యాంక్ వైస్ చైర్మన్ ముదివర్తి రాఘవరావు అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ సభ్యులకు సంక్షేమ పథకాలను బ్యాంకు అమలు చేస్తోందన్నారు. దేశ పురోభివృద్ధిలో సహకార బ్యాంకులు కీలకపాత్ర పోషిస్తున్నాయని గుర్తు చేశారు. నిబంధనల పేరుతో రిజర్వ్ బ్యాంక్ ఆంక్షలు విధించడం సరికాదన్నారు. ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించి సామాన్యులకు రుణాలు అందిస్తూ లాభాపేక్ష లేకుండా సభ్యులకే లాభాలు పంచుకున్న ఘనత విశాఖ బ్యాంకుకే దక్కుతుందని చెప్పారు. బ్యాంక్ డైరెక్టర్ నన్నపనేని అంజయ్య, జోనల్ మేనేజర్ ఎఎస్ఆర్ మూర్తి, బ్రాంచ్ మేనేజర్ అర్జునరావు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

# సీఆర్డీఏ గ్రీవెన్స్‌కు 38 ఫిర్యాదులు

తాడికొండ: ఏపీ సీఆర్డీఏ ఆధ్వర్యంలో తుళ్లూరులోని సీఆర్డీఏ ప్రాంతీయ కార్యాలయంలో ప్రతి శుక్రవారం నిర్వహించే గ్రీవెన్స్ డేకు ఈ వారం 38 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు పాల్గొని లంక భూములు, అసైన్డ్ భూములు ఎస్ఎస్‌పీ పాలసీ పలు సమస్యలపై గ్రీవెన్స్‌లో సీఆర్డీఏ అదనపు కమిషనర్ జి సూర్యసాయి ప్రవీణ్ చంద్‌కు వినతి పత్రాలు అందజేశారు. లంక అసైన్డ్ భూముల ఫిర్యాదులపై ప్రభుత్వాదేశానుసారం చర్యలు తీసకుంటామని ఆయన తెలియజేశారు. సీఆర్డీఏలోని వివిధ విభాగాలకు చెందిన అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొనగా కొన్ని సమస్యలను త్వరగా పరిష్కరించాలని సూచించారు.



# సుమోటోతో కేసు నమోదు చేయాలి

**నారాయణపూర్ అమరులకు చెందిన బంధుమిత్రుల సంఘం డిమాండ్**



సజ్జా నాగేశ్వరరావు సోదరుడిని పరామర్శిస్తున్న నేతలు

చీరాల: ప్రజా ఉద్యమంలో అమరులైన వారి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అందజేయకపోడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. నారాయణపూర్ జిల్లా మాడ్ అటవీ ప్రాంతంలో జరిగినట్లుగా చెబుతున్న ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరపాలని, సుప్రీంకోర్టు సుమోటోగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశాయి. అమరులైన వారి బంధుమిత్రుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం చీరాల మండలం జాండ్రపేటలో సజ్జా నాగేశ్వరరావు సోదరుడు సజ్జా శ్రీనివాసరావు ఇంటికి వెళ్లి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. సంఘ నాయకులు అంజమ్మ మాట్లాడుతూ ఈ నెల 20న మరణించిన అమరుల మృతదేహాలను భద్రపరచకుండా కాలయాపన చేస్తూ మృతదేహాలు కుళ్లిపోయే విధంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం.. శవాలపై కూడా హింసను ప్రయోగిస్తోందన్నారు. అంతిమ సంస్కారాల కోసం మృతదేహాలను అప్పగించకపోవడం హిందూ సంప్రదాయానికి విరుద్ధమన్నారు. విప్లవ రచయితల సంఘం నేత అరసవల్లి కృష్ణ, రాష్ట్ర చేనేత జనసమాఖ్య వ్యవస్థాపకులు మాచర్ల మోహనరావు మాట్లాడుతూ మధ్య భారతదేశంలో జరుగుతున్న ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలపై కొనసాగుతున్న సైనిక చర్యల ద్వారా మానవహననం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టు పార్టీ ప్రతినిధులు పలుమార్లు శాంతి చర్చలకు సిద్ధమని, అందులో భాగంగా కాల్పుల విరమణ ప్రకటించినప్పటికీ ఏకపక్షంగా సైనిక చర్యలకు పాల్పడుతూ దేశంలో భయానక పరిస్థితులను కేంద్రం సృష్టిస్తోందన్నారు. సజ్జా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి తమ సోదరుడు మరణించిన విషయం గానీ, మృతదేహాన్ని తీసుకువెళ్లాలనిగానీ సమాచారం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మానవత్వంతో ఆలోచించి నాగేశ్వరరావు మృతదేహాన్ని అందజేయాలన్నారు. వారి వెంట ప్రగతిశీల కార్మిక సమాఖ్య కొండారెడ్డి, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమ నాయకులు వై.వెంకటేశ్వరరావు, బహుజన సమాజ్ పార్టీ నేత పి.పుల్లయ్య, రాష్ట్ర చేనేత జన సమాఖ్య నాయకులు దేవన వీరనాగేశ్వరరావు, బీసీ ఫెడరేషన్ నాయకులు ఊటుకూరి వెంకటేశ్వర్లు, జ్యోతిర్మయి దేవాంగ సమితి బీరక పరమేష్ తదితరులున్నారు.

# వృద్ధులకు శుభవార్త!

- సీనియర్ సిటిజన్ కార్డు దరఖాస్తులకు ఆహ్వానం
- గ్రామ సచివాలయంలోనే చేసుకునే అవకాశం
- రెండు రోజుల్లోనే పొందేలా చర్యలు
- కార్డు ద్వారా పలు ప్రయోజనాలు




అధికారులు జారీ చేసిన సీనియర్ సిటిజన్ కార్డు

యడ్లపాడు: కేంద్ర ప్రభుత్వం 60 సంవత్సరాలు నిండిన వృద్ధులకు ప్రత్యేకంగా 'సీనియర్ సిటిజన్ కార్డు'లను జారీ చేయాలని నిర్ణయించింది. వీటిని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందించింది. ఈ సేవకోసం దూరంగా వెళ్లాల్సిన అవసరం లేదు. గ్రామ/వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించింది. దరఖాస్తు ప్రక్రియ కూడా చాలా సులభం. ఆధార్, వయసును నిర్ధారించే గుర్తింపు పత్రం, బ్లడ్‌గ్రూప్ వివరాలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతోపాటు రూ. 40 చెల్లిస్తే రెండు రోజుల్లోనే కార్డును అందజేస్తారు. అయితే ఆధార్ కార్డుకు లింక్ అయిన మొబైల్ నంబర్ తప్పనిసరిగా ఉండాలి.

**ఇవి ప్రయోజనాలు**

ఈ కార్డుతో వృద్ధులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పలు రకాల ప్రయోజనాలు అందుబాటులోకి రానున్నాయి. ముఖ్యంగా ఆర్టీసీ బస్సుల్లో 25శాతం రాయితీ, ప్రత్యేక సీట్లు, రైల్వే స్టేషన్లలో కౌంటర్ల వద్ద ప్రాధాన్యత, వరుసలో నిలబడి ఉండాల్సిన అవసరం ఉండదు. బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అధిక వడ్డీ, ఆదాయపు పన్ను మినహాయింపు కోసం, పాస్‌పోర్ట్ ఫీజులో తగ్గింపు వంటి లాభాలు ఉన్నాయి. ఆయుష్మాన్ భారత్‌కార్డ్, వయో వందన హెల్త్ కార్డు పొందడానికి ఉపయోగపడుతుంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆరోగ్య సంరక్షణ సౌకర్యాల కేటాయింపులతో పాటు కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ రాయితీపై ఆరోగ్య సేవలు లభించనున్నాయి. ఇంకా దేవాలయాలలో ప్రాధాన్యత దర్శనం పొందడానికి ఈ కార్డు దోహదం కానుంది.

**25వేల మందికి జారీ**

గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో ఈ ఏడాది మార్చి వరకు ఆఫ్‌లైన్‌లో 26,575 దరఖాస్తులను సీనియర్ సిటిజన్స్ సమర్పించారు. ఏప్రిల్ ఒకటి నుంచి ఈ ప్రక్రియను ఆన్‌లైన్ చేయడంతో 1438 మంది నేరుగా దరఖాస్తు చేసుకున్నారు. ఆయా అర్జీలను పరిశీలించి 25వేల మందికి పైగా కార్డులను జారీ చేసినట్లు అధికారులు తెలిపారు.

### లారీ ఢీకొని బాలుడి మృతి



తాడికొండ: లారీ ఢీకొని 12 సంవత్సరాల బాబు మృతి చెందిన ఘటన తుళ్ళూరు మండలం రాయపూడి గ్రామ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం తుళ్లూరు గ్రామానికి చెందిన అంకం అభి (12) అనే యువకుడు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా రాయపూడి పెట్రోల్ బంక్ వద్ద వేగంగా వస్తున్న లారీని ఢీకొట్టి బాలుడిని ఈడ్చుకు వెళ్లడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మైనర్ బాలుడు ద్విచక్ర వాహనం నడుపుకొని వెళుతుండటంతో ఈ ఘటన చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు రోడ్డుపై బైటాయించి న్యాయం చేయాలంటూ నిరసనకు దిగారు. రాత్రి 10 గంటల వరకు కూడా నిరసన ముగించక పోవడంతో పోలీసులు సర్ది చెప్పేందుకు యత్నించినా ఫలితం లేకుండా పోయింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తుళ్లూరు పోలీసులు తెలిపారు. లారీ డ్రైవర్ వాహనం వదిలి పరారీలో ఉండటంతో పోలీసులు గాలిస్తున్నారు. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు, రాజధానిలో కూలీ పనులు లేకపోవడంతో గేదెలు మేపుకొని జీవనం కొనసాగిస్తున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె కాగా కుమారుడి అకాల మరణంతో కన్నీరు మున్నీరుగా విలపించారు. తల్లిదండ్రులతో పాటు స్థానికులు అందరూ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేస్తుండటంతో ట్రాఫిక్ స్తంభించింది.

### బూత్ కమిటీ జిల్లా అధ్యక్షులుగా శ్రీనివాసరెడ్డి



బాపట్ల టౌన్: బాపట్ల నియోజకవర్గానికి చెందిన మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బాపట్ల జిల్లా బూత్ కమిటీల విభాగం అధ్యక్షులుగా నియమిస్తూ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. బాపట్ల జిల్లాలో బూత్ కమిటీలను సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. తనను ఈ పదవిలో నియమించినందుకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

### బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడి అరెస్టు

యడ్లపాడు: బాలికపై లైంగిక దాడి ఘటనలో పోక్సో కేసు నమోదైన యువకుడిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. కోర్టుకు హాజరు పరచగా రిమాండ్ విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం హౌస్ గణేష్‌పాడు గ్రామ నివాసి ఆళ్ల కొండలు, మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ బాలికను ఆసక్తికరమైన మాటలతో ఆకర్షించాడు. సుదూర ప్రాంతాలకు తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన గత నెల 15న జరిగింది. ఈ మేరకు బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు ఆధారంగా యడ్లపాడు పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. నరసరావుపేట డీఎస్పీ పర్యవేక్షణలో విచారణ చేపట్టిన పోలీసులు, సాంకేతిక ఆధారాలతో పాటు వాంగ్మూలాలు సేకరించారు. నిందితుడిని ఈ నెల 22న పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం బోయపాలెంలోని హైవే వంతెన వద్ద పట్టుకున్నారు. చిలకలూరిపేట అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు హాజరు పరుచగా, జూన్ 5వ తేదీ వరకు రిమాండ్ విధించినట్లు యడ్లపాడు ఎస్‌ఐ టి. శివరామకృష్ణ తెలిపారు.

### బదిలీల దరఖాస్తులో జాగ్రత్తలు అవసరం

నరసరావుపేట ఈస్ట్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు దరఖాస్తు చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు సూచించారు. ఉపాధ్యాయుల బదిలీలపై శుక్రవారం యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దరఖాస్తు చేసే సమయంలో సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ప్రభుత్వం దాదాపు 770 ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయటం మంచి పరిణామమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచటంలోనూ, విద్యార్థుల నమోదు, హాజరు పెంచటంలోనూ కార్యకర్తలు ముందుండాలని సూచించారు.